# సంపాదకీయం

# "దేశభక్తి"

1985 జనవరి 12 రాత్రి 9-30 గంటలప్పుడు ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం జగిత్యాల తాలూకా ఉపాధ్యక్షుడు, అడ్వకేట్ గోపి రాజన్న జగిత్యాల పట్టణంలో తుపాకులతో కాల్చి చంప బడ్డాడు.

చంపిన వాళ్ళు "దేశభక్తి" గురించి, "అహింస" గురించి నిత్యం ఆక్రోశించే రాష్ట్రీయ స్వయం సేవక సంఘం (ఆర్.యస్.యస్). భారతీయ జనతా పార్టీ [బి.జె.పి.] లకు చెందినవాళ్ళు. ఒక పద్ధతి ప్రకారం ప్లాన్ వేసుకొని వచ్చి భార్యతో సినిమాకు పోయిన గోపి రాజన్న ఇంటిబయట కాపుకాసి. వాళ్ళు తిరిగి రాగానే కాల్చి చంపారు. హంతకులను పట్టుకునే ప్రయత్నంచేసిన రాజన్న భార్యను తలమీద తుపాకి మడమతో స్పృహ కోల్పోయే లాగకొట్టి పడేసి పోయారు.

అహింస గురించి, ఈ మధ్యకాలంలో గాంధీయిజం గురించి నిరంతరం మాట్లాడే ఆర్. ఎస్. ఎస్. - బి. జె. పి. లకు గోపి రాజన్నను చంపాల్సిన అవసరం ఏం వచ్చింది?

భూమిలేని పేద రైతు కుటుంబంలో [జగిత్యాల తాలూకా కోలవాయి గ్రామంలో] పుట్టిన రాజన్న ట్యూషన్‌లు చెప్పుకొని చదువుకున్నాడు. ఈ ఆర్ యస్.యస్. వారి "శిశుమందిర్"లోనే చదువు చెప్పాడు. కాని ఆర్.యస్.యస్. ఫాసిస్టు స్వభావాన్ని, ఆ సంస్థమీద పెత్తందార్ల పెత్తనాన్ని చూసి విసిగిపోయి వదిలి పెట్టాడు. "లా" చదివి 1981లో జగిత్యాలలోనే ప్రాక్టీసు పెట్టాడు. అప్పటినుండి పౌరహక్కుల సంఘంలో పనిచేస్తున్నాడు. "కల్లోలిత ప్రాంతంగా" ఆరేళ్ళ క్రితం ప్రకటించిన జగిత్యాల తాలూకాలో పేద ప్రజల మీద పోలీసులు చేస్తున్న పాశవికమైన అత్యాచారాలను ఖండించడంలో నిరంతరం కృషి చేశాడు. పోలీసులు పేద రైతాంగం మీద మూకుమ్మడిగా తప్పుడు కేసులు బనాయిస్తూ వుంటే, ఒక పేద రైతు ఇంట్లో పుట్టి వకీలు పట్టా తీసుకున్న వ్యక్తిగా వాళ్ళకు వృత్తి పరంగా సహాయం చేశాడు. ఒక సంవత్సరం క్రితం జగిత్యాల బార్‌లోని ఆర్.యస్.యస్. - బి.జె.పి. న్యాయవాదులు రాజన్నను కోర్టులోనే పట్టుకొని తలుపులు మూసి "నక్సలైట్లపై కేసులు చేయడం మానేయమ"ని, "పౌరహక్కుల సంఘంలో పనిచేయడం మానేయ"మని బెదిరించారు. అయినా రాజన్న బెదరలేదు.

అందుకే రాజన్నను ఆర్.యస్.యస్. - బి.జె.పి. ఫాసిస్టులు చంపారు.

దేశంలో ఎక్కడయినాసరే ప్రజల పక్షాన నిలబడి వాళ్ళవాళ్ళ హక్కుల గురించి అడిగేవాళ్ళు వీళ్ళకు శత్రువులు. పేదల కేసులు చేయడానికి వీలులేదట. వాళ్ళను అన్యాయంగా పోలీసులు కొడితే అడగటానికి వీలులేదట, కేసులు చేసినా, అడిగినా చంపుతారట. చంపడానికి వీళ్ళకు ఆయుధాలు - ఎన్టీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. "ఆత్మరక్షణ"కోసం ఆయుధాలు కావాలని అడిగి తీసుకొని ప్లాన్ ప్రకారం రాజన్నను హత్యచేశారు. "కల్లోలితప్రాంతం"గా ప్రకటించిన జగిత్యాలలో, ఆయుధంగాని, ఆయుధంగా ఉపయోగించబడగల పరికరంగాని చేతిలో పట్టుకోవటం చట్టప్రకారం నేరం. ఎంతో మంది పేద రైతులను చేతిలో కొడవలి, గొడ్డలి, పలుగు, పార ఉన్నా యని చెప్పి వాళ్ళను "తీవ్రవాదులు" అని అరెస్టు చేసి కేసులుపెట్టి కోర్టులచుట్టూ త్రిప్పుతున్నారు. అటువంటి ప్రాంతంలో ప్రభుత్వం ఈ అహింసావాదులకు ఆయుధాల లైసెన్సులు ఎట్లా ఇచ్చింది? ప్రతిపక్షాల ఐక్యత పేరిట బి.జె.పి. కి ఎన్టీఆర్‌తో కుదిరిన సఖ్య సంబంధం ఫలమా యిది?

పేద ప్రజలపై పోలీసులు, అధికార యంత్రాంగం, పెత్తం దార్లు చేసే అత్యాచారాలను పౌర హక్కుల సంఘం ఖండిస్తుంది. కూలికోసం, రెండు గుంటల భూమికోసం పోరాడేవాళ్ళను మూకు మ్మడి నేరస్తులుగా ప్రకటించి వాళ్ళను చిత్రహింసల పాలుచేస్తే పౌరహక్కుల సంఘం వ్యతిరేకిస్తుంది.

గత ఆరేళ్ళుగా తెలంగాణా జిల్లాలో, ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో పేద ప్రజలపై ఇటువంటి దాడులు విపరీతంగా సాగుతు న్నాయి. గ్రామాలమీద పడి పోలీసులు రైతాంగాన్ని గొడ్లను బాది నట్లు బాదుతున్నారు. వాళ్ళ ఇళ్ళను కూలగొడుతున్నారు. కుండలు, గాదెలు పగులకొడుతున్నారు. రేడియోలవంటి విలువైన వస్తువు లను నాశనం చేస్తున్నారు. యువకులను అరెస్టుచేసి రోజుల తరబడి అక్రమ నిర్బంధంలో ఉంచి రోకలిబండ లెక్కించి తొక్కుతున్నారు. చర్మం ఊడిపోయేలా చితకబాదుతున్నారు. వారి పొలాల్లోకి పశువు లను తోలి మేపుతున్నారు. పొలాలకు నీరు ఆపి ఎండబెడుతున్నారు. యువకులను గ్రామాలనుండి తరిమేసి వారిమీద ఆధారపడే కుటుంబా లను నాశనం చేస్తున్నారు. బెదిరించి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. తప్పుడు కేసులు బనాయించి కోర్టులచుట్టూ తిప్పుతూ ఇళ్ళు గుల్లచేస్తున్నారు. పౌరహక్కుల సంఘం ఈ అక్రమాలను వ్యతిరేకిస్తుంది. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుంది. ఇది ఆర్.యస్.యస్. - బి.జె.పి.లకు ఎందుకు అభ్యంతరకరంగా కనిపిస్తోందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి కంకణం కట్టుకున్నట్లు మాట్లాడే ఈ సంస్థలు పోలీసు అత్యాచారాలను వ్యతిరేకించే వాళ్ళను ఎందుకు హత్యచేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. అయినా, పౌరహక్కుల సంఘం ఈ బెది రింపులకు హత్యలకు భయపడి తన కర్తవ్యాన్ని వదిలిపెట్టదు. గోపి రాజన్న హత్య పౌరహక్కుల సంఘాన్ని మరింత దృఢదీక్షతో పనిచేయిస్తే తప్ప ఈ ప్రజావ్యతిరేకులు ఆశించినట్టు భయపెట్టదు.

---

"గోపి రాజన్న కుటుంబ సహాయ నిధి"కి

మీ విరాళాలను శ్రీ. కోదండరామిరెడ్డికి పంపండి

---